ప్రజాశక్తి
ఆదివారం 8 డిసెంబర్ 2024
5
విజయనగరం

జాతీయ స్థాయి పోటీలకు యస్మిత ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9 వ తేదీ నుండి 15 వ తేదీ వరకు ఢిల్లీలో జరుగనున్న అండర్ -19 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి ఉషూ పోటీలకు జిల్లాకు చెందిన విక్రమ్ యస్మిత ఎంపికైంది. ఈ సందర్భంగా యస్మితను స్కూల్ గేమ్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ, ఉష్ జిల్లా అధ్యక్షుడు గోరపోటు శ్రీనివాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు అభినందించారు.

పండుగలా టీచర్స్, పేరెంట్స్ మీట్

- పాఠశాలల్లో కోలాహలం • తల్లిదండ్రులకు ఆటల పోటీలు
- ఆకట్టుకున్న పూర్వ విద్యార్థుల ప్రసంగాలు • విద్యార్థుల ఉపన్యాసాలు
- ఎదుగుదలకు చదువే మార్గం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పిల్లలతో సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్

పాఠశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, వారి తల్లులు

ప్రజాశక్తి-జామి, విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పండగ వాతావరణంలో జరిగింది. పాఠశాలలను రంగ వల్లులతో విద్యార్థులంతా సుందరంగా అలంకరించారు. మామిడితోరణాలు, అరటి మొక్కలతో స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సాదర స్వాగతం పలికిన నుంచి మధ్యాహ్నం పసైందన భోజనం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, పాఠశాలతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు.

ఎదుగుదలకు చదువే మార్గం

చదువు వ్యక్తి ఎదుగుదలకు దోహదం చేస్తుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జామి మండలం కుమరాం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ కలయికకు మంత్రి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చదువకోవడం ద్వారా ఉన్నత స్థానాన్ని సాధించవచ్చునని అన్నారు. చదువుతోబాటు ఆటలు కూడా పిల్లలకు ఎంతో ముఖ్యమని, కొంత సమయాన్ని ఆటలకోసం కూడా కేటాయించాలని కోరారు. సామాజిక స్థితిని మెరుగుపర్చే అవకాశం నేటి యువత చేతుల్లోనే ఉందన్నారు. శక్తివంతమైన యువతను రూపొందించే బాధ్యత తల్లితండ్రుల్లో ఉందన్నారు. పాఠశాల ప్రహరీగోడ, డైనింగ్ హాల్ నిర్మాణానికి, కంప్యూటర్ ల్యాబ్ మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిఇఒ యు.మాణిక్యంనాయుడు

జామి : విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న మంత్రి కె.శ్రీనివాస్

మాట్లాడుతూ, మంచి సమాజాన్ని రూపొందించేది పాఠశాలేనని అన్నారు. తల్లితండ్రులు తరచూ పిల్లల బాగోగులను, వారి చదువును గమనిస్తుండాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాధ్యతతో చదవి లక్ష్యాన్ని సాధించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు గొర్లె సరయు మాట్లాడారు. ముందుగా పాఠశాల హెచ్ఎం చిట్టి పద్మావతి అధ్యక్షోపన్యాసం చేస్తూ, పాఠశాల ప్రగతిని వివరించారు. తల్లితండ్రులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్ట్ డిఇ యడ్ల గోవిందరావు మాట్లాడుతూ, తమ అనుభవాలను, పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం మంత్రి చేతులమీదుగా విద్యార్థుల హెల్త్ కార్డులను, ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ కెవి వెంకటరమణ, మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి, ఎంఈఓలు జె.జయశ్రీ, గంగరాజు, ఎంపిడిఒ గంట అప్పలనాయుడు, సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, ఎంపిటిసి కంది పద్మావతి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం మండలం మరిచర్ల జిల్లా పరిషత్ హై స్కూలులో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ హాజరయ్యారు. పిల్లల విద్య, ఆరోగ్య పరిస్థితుల పై సమగ్ర ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను ఉపాధ్యాయులు ప్రతి తల్లిదండ్రులకు వివరించారు. తల్లులకు రంగోళీ పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. మెడికల్ క్యాంపు నిర్వహించి తల్లి దండ్రులకు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమగు మాత్రలు పంపిణీ చేసారు. అనంతరం సదస్సు నిర్వహించి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో సహపంక్తి భోజనాలు చేసారు.

వేపాడ : గురుకులంలో థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మలిచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



మంత్రి మనోహర్‌కు వినతినిస్తున్న 104 ఉద్యోగులు

పౌర సరఫరాల వ్యవస్థ నాశనం

జనసైనికులకు అండగా ఉంటాం : మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-బొబ్బిలి/ విజయనగరటౌన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లాలో పర్యటించిన ఆయన బొబ్బిలి కోటలో శనివారం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ పేరుతో వ్యవస్థను నాశనం చేసిందన్నారు. రేషన్ బియ్యాన్ని కిలో రూ.10కు కొనుగోలు చేసి ఇతర దేశాలకు కిలో రూ.70కు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. కాకినాడ పోర్టులో కోటి 31లక్షల మెట్రిక్ టన్నులు బియ్యం సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పాత పద్దతిలో రేషన్ షాపులలో సరుకులు ఇస్తే 1 నుంచి 15 మధ్యలో నచ్చిన సమయంలో సరుకులు తీసుకునే వారని చెప్పారు. రేషన్ వ్యాన్ కు నెలకు రూ.27వేలు ప్రభుత్వం బ్యాంకులకు ఇఎంఐ చెల్లిస్తుందని చెప్పారు. బ్యాంకర్లతో మాట్లాడి వ్యాన్లపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు మంత్రి నాదెండ్లకు ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అడవిలో బేబినాయన చిత్రీకరించిన ఫోటోను బహుకరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, అల్లాడ భాస్కరరావు, రాంబార్కి శరత్, ఎస్.సాయిరమేష్, వి.సత్యనారాయణ, జనసేన నాయకులు బాబు పాలూరి, తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులకు అండగా ఉంటాం

విజయనగరంటౌన్ : జన సైనికులకు అండగా జన సేన ఉంటుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతి చెందిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో జనసేన జెండా మోసి ఎన్నో అవమానాలు, కేసులు తట్టుకుని పార్టీ కోసం నిలబడం గర్వకారణం అన్నారు. పార్టీలో ప్రతి జన సైనికుడిని అదుకోవాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. మార్పు కోసం అంతా ఎదురు చూసి రాక్షస ప్రభుత్వాన్ని లేకుండా చేశారని అన్నారు. కూటమి లో ఉంటూ అబివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎవ్వరూ కూటమికి వ్యతిరేకంగా వ్యవహరించ కూడదని సూచించారు. చిన్న చిన్న మనస్పర్ధలు ఉంటే అర్థం చేసుకుని సర్దుకు పోవాలని తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి 104 ఉద్యోగుల వినతి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు 104 ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతినిచ్చారు. పి హెచ్ సిల ద్వారా తమను కొనసాగించాలని, అరబిందో యాజమాన్యం నుంచి రావాలిసిన బకాయి జీతాలు, ఇంక్రిమెంట్, పిఎఫ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని కోరారు. వినతినిచ్చిన వారిలో 104 సిబ్బంది డిఇఒ దుమ్ము జగన్మోహన్, డ్రైవర్ మచ్చా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వల్ల నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థి దశ నుండే చైతన్యం చేయాలన్న ఉద్దేశంతో నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. శనివారం 12వ నెంబరు సచివాలయ పరిధిలో ఉన్న లిటిల్ హార్ట్స్ పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తలు అంటే ఏమిటనే విషయమై వివరించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు గూర్చి తెలిపారు. వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లో వేయడం వల్ల అవి కరిగి మానవాళి ఆరోగ్యం పై ఎంతో హాని కలిగించే వ్యాధులకు గురిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం : కమిషనర్

విజయనగరం టౌన్ :మహిళలు ఆరోగ్యవంతులుగా ఉన్న నాడే సమాజం పరిఢవిల్లుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఆయన ఆదేశాలతో ప్రతి సచివాలయ పరిధిలో గర్భిణీ స్త్రీలు, మహిళలకు వివిధ పరీక్షలను ఎఎన్ఎంలు, హెల్త్ కార్యదర్శులు చేపడుతున్నారు. ఇంటింటికి వెళ్లి గర్భిణీ స్త్రీలు, బాలింతల వివరాలను ముందుగా నమోదు చేసుకుని క్రమం తప్పకుండా వారికి అందాల్సిన ఆరోగ్య సేవలను అందిస్తున్నారు.

టెన్నిస్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హైదరాబాద్‌లో జివికె ఆలిండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ నిర్వహిస్తోన్న టెన్నిస్‌ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. 65 డబుల్స్ విభాగంలో సన్యాసిరాజు , శ్రీనివాస్ రెడ్డి జోడి విజేతలుగా నిలిచారు. 45 విభాగంలో సౌమిత్రి , దినకర్ రెడ్డి ఫైనల్స్‌కు చేరుకున్నారు. జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడలో సౌమిత్రి , సన్యాసిరాజు ఇప్పటికే అనేక ట్రోఫీలు సొంతం చేసుకున్నారు. వీరిని ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు వెంకటఅప్పారావు, రాంబాబు, గాంధీ, శంకర్రావు, రామారావు, చీఫ్ కోచ్ ఫ్రెడ్రిక్, మల్లిక్, అభినందించారు.

మామిడి ఉత్పత్తుల నాణ్యత పెంచేలా చర్యలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో మామిడి పండించే రైతులను శాస్త్రీయ పద్ధతుల్లో పంటను సాగు చేసేలా ప్రోత్సహించడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడి సాధించడంతో పాటు పలు రకాల ఉత్పత్తులుగా మలిచి విలువను జోడించేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు రాష్ట్ర చిన్నపరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. దీనికోసం జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకం కింద మామిడి క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మామిడి సాగులో అత్యుత్తమ పద్ధతులు పాటిస్తున్న నూజివీడు, సంగారెడ్డి వంటి ప్రాంతాలకు మన జిల్లాలో మామిడి పండించే కొందరు రైతులను, ఉద్యాన అధికారులను తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. జిల్లాలో మామిడి క్లస్టర్ పై ఉద్యాన రైతుల్లో అవగాహన కల్పించేందుకు మహిళా ప్రాంగణంలో రైతులు, ఉద్యాన అధికారులు, బ్యాంకు అధికారులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి పంట సాగులో క్రిమి సంహారకాల వినియోగం అధికంగా వున్నందున విదేశాలకు మామిడి ఎగుమతులు చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ విషయంలో రైతుల్లో అవగాహన కల్పించి సేంద్రీయ పద్ధతుల్లో మామిడి సాగును ప్రోత్సహించాల్సి వుందన్నారు. అధునాతన పద్ధతులను వినియోగించి నాణ్యమైన పంట దిగుబడి సాధించేలా రైతులకు శాస్త్రీయ పరమైన సలహాలను అందించాల్సి వుందన్నారు. దీనికోసం మామిడి రైతులకు తగిన సలహాలు, సూచనలు చేసేలా ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు కోసం ప్రయత్నిస్తామన్నారు. మామిడి క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను డిసెంబరు నాటికల్లా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా ఉద్యాన అధికారి జమదగ్ని మాట్లాడుతూ జిల్లాలో 30,800 హెక్టార్లల్లో మామిడి పండిస్తున్నారని చెప్పారు. మంత్రి సూచనల మేరకు రైతులు, బ్యాంకు అధికారులు, ఉద్యాన అధికారులతో కమిటీ ఏర్పాటుచేసి డి.పి.ఆర్.సిద్ధం చేస్తామని చెప్పారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణచక్రవర్తి, ఎంఎస్ఎంఇ. శాఖ ఎస్.డి. శంకర్ ప్రసాద్, ఎల్‌డిఎం. రమణమూర్తి, ఎపిఎంఐపి పీడీ.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ ఆష్మా పట్నాగర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

క్షయ నిర్మూలనకు జిల్లా నుంచే శ్రీకారం చుడుతున్నట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ ఆష్మా పట్నాగర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వందరోజుల టి.బి. ఎలిమిలేషన్ క్యాంపైన్ ను, రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ వాకాటి కరుణ శనివారం జిల్లానుంచి ప్రారంభించారు. రాష్ట్రం నుంచి, జిల్లా నుంచి టిబిని పూర్తిగా నిర్మూలించా లని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆష్మా పట్నాగర్ మాట్లాడుతూ, భారతదేశంలో 347 కేంద్రాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై విస్తత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నా మని అన్నారు. ఇతర ప్రాంతాలతో పాటు విజయనగరం జిల్లాను టి.బి.రహిత జిల్లాగా ఉంచాలని, అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని చేరగలమని చెప్పారు. క్షయ నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేటి నుండి సిబ్బంది అన్ని గ్రామాల్లో తిరిగి టి.బి. పరీక్షలు చేయించి, వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆరు నెలలు పాటు మందులు, పోషకాహారం నిమిత్తం నెలకు రూ.500 చొప్పున అందజేస్తారని తెలిపారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ, పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్లు, సూపవైజర్లు శ్రద్ద తీసుకొని, టిబి రహిత జిల్లాగా చేయడానికి సహకరించాలని కోరారు. ఆరోగ్య సిబ్బందిచేత ప్రతిజ్ఞ చేయించారు. రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో 15మంది టి.బి.రోగులకు పౌష్టికాహార కిట్లను ఆష్మా పట్నాగర్ చేతుల మీదుగా అందజేశారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆష్మా పట్నాగర్, జెడి డాక్టర్ రమేష్

తక్షణ పరిష్కారంపై దృష్టి పెట్టండి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రెవెన్యూ సదస్సుల్లో వచ్చే వినతుల్లో అవకాశం ఉన్నవాటిని అక్కడికక్కడే పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో అప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయించి, వెంటవెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో శనివారం కలెక్టర్ అంబేద్కర్, జెసి ఎస్.సేతు మాధవన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటిరోజు జిల్లావ్యాప్తంగా 39 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, వీటిలో 533వినతులు అందాయని చెప్పారు. వాటిని ఆన్‌లైన్ చేయడంపై మండలాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం 45 రకాల సేవలను ఉచితంగా అందిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొనే విధంగా చూడాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లితే తాహశీల్దార్లదే బాధ్యతని అన్నారు. ఏరోజుకారోజు వినతుల వివరాలను మధ్యాహ్నం 2 గంటలు లోపు నమోదు చేయాలని, సదస్సు రెండుపూటలా జరిగిన పక్షంలో రాత్రి 7 గంటల లోపు నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సాయుధ దళాల పతాకదినోత్సవం

సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి కలెక్టర్‌కు పతాక నిధి ఫ్లాగ్ ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాకదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి , సాహసం, త్యాగాలను దేశం స్మరించుకోవాలని తెలిపారు. .పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాలలోను, కార్గిల్ పోరాటం, బొంబాయి తాజ్ హోటల్ దురాక్రమణ సమయం లోను, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను మన సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తున్నదని తెలిపారు. సైనికుల కుటుంబాలకు చేయుతనిచ్చేందుకు విరివిగా విరాళాలు అందించాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, రిటైర్డు కల్నల్ ఎన్ఎల్ఎన్ మూర్తి, బాలికల ఎన్‌సిసి యూనిట్ ఎస్.భాస్కరరావు, కల్యాణ్ అశోక్, వరలక్ష్మి, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు భూదందాలు బయట పడేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామంటే ఎవరికి మాత్రం ఆత్రం ఉండదు. ఇప్పటికే తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు రైతులు, సాధారణ ప్రజానీకం కాళ్ల అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, ముఖ్యంగా కలెక్టరేట్‌లోని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తిరుగుతున్నారు. మరికొంతమంది ప్రభుత్వ, అటవీ భూములు, చెరువులు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులు చేస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను అడ్డం పెట్టుకుని కూడా భోగాపురం, పూసపాటిరేగ తదితర మండలాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు వశపర్చుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో పేదలు, దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను కూడా చాలా మంది పెత్తందారులు తమ ఆదీనంలోకి తెచ్చుకున్నారు. ఇంకా చెప్పాలంటే రాజకీయ జోక్యం, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములపై ఉన్న 22ఎను ఎత్తివేశారు. ఇలా భూముల పరిరక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నా వాటిలో లొసుగులను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకించి రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూ వివాదాలపై వినతుల స్వీకరణ కోసం గత ఆగస్టులో ప్రత్యేకించి మన జిల్లాకు ఏకంగా రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా రావడం అభినందనీయమే. కానీ, రికార్డులను ప్రక్షాళన చేయడంతోపాటు భూ సమస్యలను పరిష్కరించేందుకే వచ్చానంటూ సిసోడియా చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు కూడా జరుగుతున్నాయి. ఈ సదస్సుల్లో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ విజయనగరం, పార్వతీపురం మన్యం



జిల్లాలకు చెందిన మంత్రులు, కలెక్టర్లు, జెసిలు ఇతర అధికారులు శెలవిస్తున్నారు. ఈనేపథ్యంలో ఒకటి అర ప్రజలు విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించి మమా అనిపిస్తారా? లేక బడాబాబుల అటలు కట్టించే వరకు కొనసాగుతుందా? అన్నది చాలా మంది నోటి వినిపిస్తున్నా మాట. గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, రీ సర్వే, జగనన్న కాలనీలు తదితర పేర్లతో సేకరించిన భూమి కొనుగోలు, చెల్లింపులు వ్యవహారాలకే పరిమితమౌతుందా? అన్నది కూడా పబ్లిక్ టాక్. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట పనికి రాని భూములను రూ.కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో, చాలాచోట్ల ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు కూడా లబ్ధిదారులు ముందుకు రాలేదు. రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన గుంకలాం లేఅవుట్ స్థలం కొనుగోలు మొదలుకుని, కేటాయింపుల వరకు అవినీతి జరిగిందని అప్పట్లో సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే బహిరంగ చర్చకు తెరలేపారు. అటు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని పేదలకు పెదమరికి కొండవాలు ప్రాంతంపై స్థలాలు ఇచ్చారు. వీటితోపాటు అనేక చోట్ల రూ.కోట్ల అవినీతి జరిగిందన్నది అప్పట్లో బహిరంగ చర్చ నడిచింది. మరోవైపు 20ఏళ్లకు మునుపు పొందిన అసైన్డ్ భూములను సంబంధిత దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల పేదలకు రెగ్యులర్ చేస్తామంటూ గత ప్రభుత్వం జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. ఆచరణలో వాటిలో ఎక్కువ భాగం అప్పటి ప్రభుత్వంలోని అధికారులు, నాయకులే కొనుగోలు చేసినట్టు విమర్శలు వచ్చాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో కొన్ని దందాలు, అక్రమ కొనుగోళు రెండు నెలల క్రితం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చిన సంగతి కూడా తెలిసిందే. ఇంకా లోతుల్లోకి వెళ్తే దళితుల పేరున ఉన్న అసైన్డ్ భూములను రికార్డుల్లో తారుమారు చేశారు. ఇటువంటివి మెంటాడ, వేపాడ మండలాల్లో కొకొల్లాలుగా ఉన్నాయి. గిరిజన ప్రాంతంలో పెత్తందారుల ఆక్రమణలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, రాజకీయ జోక్యం, పార్టీల ప్రమేయం పక్కనబెట్టి ఈ భూ ఆక్రమాలన్నీ వెలికి తీయాలని, పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జనం చర్చించు కుంటున్నారు. కేవలం గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపైనే చర్చ నడిస్తే అది కేవలం కక్ష సాధింపుగానే మిగిలిపోతుంది తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదని కూడా పబ్లిక్ టాక్.

పాఠశాలల్లో సందడే సందడి

- కోలాహలంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం
- హాజరైన పలువురు ఎమ్మెల్యేలు

డెంకాడ : ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి తదితరులు

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, గురుకులాల్లో శనివారం 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్'ను ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. ఇందులో భాగంగా పలు పాఠశాలల్లో పిల్లలు వేసిన నృత్యాలు, వేశధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు రకాల క్రీడల్లో విజేతలకు ముఖ్య అతిథులు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజాశక్తి - కొత్తవలస

మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ చూస్తుంటే సంక్రాంతి పండగ ముందే వచ్చినట్టు ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. దెందేరు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలను చూసిన తరువాత తనకు తన స్కూల్ డేస్ గుర్తొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జి ఒబ్బిన సత్యనారాయణ, రాష్ట్ర గిరిజన శాఖ బోర్డ్ డైరెక్టర్, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, టిడిపి నాయకులు నిరుజోగి అమ్మతల్లినాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పిల్లలు పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశానికి సిఐ సతీష్ కుమార్ హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో హెచ్ఎం వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలో బొండపల్లి, దేవుపల్లి, రాచకిండాం, గెద్దపేట, ఎం కొత్తవలస, చినతామరాపల్లి, కెరటాం పాఠశాలల్లో పేరెంట్ టీచర్ మీటింగ్‌లో భాగంగా తల్లితండ్రులకు రంగోలి పోటీలు, టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, గొట్లాంలో మండల నోడల్ అధికారి సాల్మన్ రాజు, ఎంఇఒలు శోభారాణి, వెంకటరమణ, పలు పాఠశాలల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పాల్గొని పేరెంట్స్ వేసిన ముగ్గుల పోటీలను ఆశక్తిగా తిలకించారు. వివిధపోటీలలో విజేతలకు బహుమతులు అందజేసి, అందరికీ మధ్యాహ్న భోజనం స్వయంగా వడ్డించి తనూ పేరెంట్స్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యన్నారాయణ, వైస్ ఎంపిపి ఎల్ భాస్కరరావు, ఎంపిటిసి శ్రీనివాసరావు, సర్పంచ్ రమేష్, ఎస్ఐ తారకేశ్వరరావు, ఎస్ఎంసి చైర్‌పర్సన్ భారతి, టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: విద్యార్థులకు మంచి ఆరోగ్యం, మంచి భోజనం, మంచి చదువు అందించే పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు మాత్రమేనని మండల నోడల్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. గర్భాం జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, సత్తారు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, తాడ్డి చంద్ర శేఖర్, పాఠశాల కమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్ ఆచార్యులు, డివిఎస్ ఆరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రావాడ, పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొని మాట్లాడారు. ఆయన రావాడ పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో పాఠశాల అభివృద్ధి కోసం రూ.20వేలు ప్రకటించారు. మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కర్రోతు వెంకటరమణ, అప్పురుబుక్త పైడినాయుడు, పతివాడ రామకృష్ణ, అమనాపు శ్రీను, పిళ్లా సత్యవతి పాల్గొన్నారు. భోగాపురం జెడ్‌పి హైస్కూలులో హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఘనంగా పేరెంట్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

భోగాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల మధ్య టగ్ ఆఫ్ వార్ పోటీలు

కొత్తవలస : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

రాజాం: మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ పాల్గొని మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్తు, నాణ్యమైన చదువుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం గంజాయి, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన పోస్టర్లను టౌన్ సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని 67 పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ప్రజలు ఆసక్తి చూపించలేదు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేరెంట్స్ మీటింగ్ మండలంలో పెరుమాలి జిల్లా పరిషత్ హై స్కూల్, ఎపి మోడల్ స్కూల్, కునయవలస పాఠశాలల్లో మినహా మిగిలిన చోట ఎక్కడా పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు ఈ సమావేశాలకు హాజరు కాలేదు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వీటి రామారావు, తహశీల్దారు హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒ త్రినాథరావు, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం శ్రీదేవి, కునయవలస సర్పంచ్ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

మా బాధలు పట్టవా?

నాయకులు, ఉపాధ్యాయులను నిలదీసిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

'మా బాధలు పట్టవా.? మా సమస్యలు, మా పిల్లల సమస్యలు మీకు పట్టవా.? ఎంత సేపూ ఉపాధ్యాయులను నాయకులు, నాయకులను ఉపాధ్యాయులు పొగుడుకుంటూ ఉంటే సరిపోతుందా.? పాఠశాలలో నెలకొన్న సమస్యలను చెప్పుకొందామని వస్తే మీ ప్రసంగాలే తప్ప మమ్మల్ని మాట్లాడనివ్వరా.? మా గోడు, పాఠశాలలో మా పిల్లల సమస్యలు చెప్పేందుకే కదా ఈ సమావేశాలు. అలాంటప్పుడు ఎందుకు మాకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు' అని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను, నాయకులను నిలదీశారు. తల్లిదండ్రుల హాజరైన ఈ సమావేశంలో స్థానిక టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, జనసేన నాయకులు విసిని శ్రీనివాసరావు, కోట్ల కృష్ణతో పాటు ప్రధానోపాధ్యాయుని రెహానా బేగం, ఐసిడియస్ పిఒ రాజారమణి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడి వెలుపోతుండగా పేరెంట్స్ తమని ఎందుకు సమావేశానికి పిలిచినట్లు సమస్యలు తెలుసుకోరా.. మా పేరెంట్స్‌తో కూడా మాట్లాడించాలి కదా అని నాయకులను అడ్డుకున్నారు. దీంతో వేరే సమావేశం ఉంది ఉపాధ్యాయులతో మాట్లాడాలని వారు సమావేశం నుండి వెళ్లిపోయారు. అనంతరం తమని కూడా మాట్లాడించాలని, పాఠశాలలో తమ పిలల్లు ఎదుర్కొంటున్న సమస్యలను తాము తమతో చెప్పుకోవాలని ప్రధానోపాధ్యాయుని రెహానా బేగంని పేరెంట్స్ అడిగారు. మీ సమస్యలేమైనా ఉంటే తరువాత చెప్పుకుందురు గానీ ఇది సమయం కాదని జిల్లా అధికారులు వచ్చారు అని చెప్పడంతో పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులున్నప్పుడు మా సమస్యలు చెప్పుకునేందుకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. మా పిల్లలకు బాత్‌రూంలు గానీ, సైకిల్ స్టాండ్ గానీ, భోజనం సదుపాయం గానీ సరిగా లేవని పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేసారు. మిమ్మల్ని నమ్మి పాశాలకు పంపిస్తే ఇలాగేనా సౌకర్యాలు కల్పించేది అని మండిపడ్డారు. పురుగులతో కూడిన అన్నాన్ని పెట్టి మా పిల్లల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని మహిళా పేరెంట్లు ఆవేదన వ్యక్త చేశారు. ఇలా అయితే మా పిల్లల్ని చదివించేది లేదన పిల్లల తల్లిదండ్రులు తెగేసి చెప్పారు.

నాయకులను నిలదీస్తున్న పిల్లల తల్లిదండ్రులు

బొబ్బిలి: పిరిడి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, డిఎస్‌పి

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు ఉన్నత చదువులు చదివి విజ్ఞాన వంతులు కావాలని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శనివారం పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకేరోజు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశం కావడం దేశంలో ఎక్కడా జరగలేదని ఇలాంటి సమావేశం నిర్వహించడం వల్ల వ్యవస్థల్లో లోపాలు తెలుస్తాయని అన్నారు. విద్యార్థుల ఎలా చదువు తున్నారో తెలుసుకొనే అవకాశం తల్లిదండ్రులకు తెలుస్తుందని చెప్పారు. డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురువుల పట్ల గౌరవ భావం ఉండాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రాంమోహన్, ఎంపిడిఒ రవి కుమార్, ఎంఇఒ 2 వాసు, ఎస్ఎంసి చైర్‌పర్సన్ జె. పుష్పావతి, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ, సోంపురం, ఎన్‌కెఆర్‌పురం, బొద్దాం పాఠశాలల్లో నిర్వహించిన కారక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు. అనంతరం దాతలు ఇచ్చిన ఐదు సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ, ఎస్ఐ బి,దేవి, నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, రాష్ట్ర ఎస్‌టి సెల్ నెంబరు దాసరి లక్ష్మి, టిడిపి ప్రధాన కార్యదర్శి కె. రమణమూర్తి. ఎంఇఒ పి బాల భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, పేరెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బక్కునాయుడుపేట అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో, కెజిబివి వసతిగృహంలోనూ, ఎపి ఆదర్శ పాఠశాలలోనూ నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ టిఎం ఫోరెన్స్, ప్రిన్సిపల్ ఉషారాణి, ఎస్ఒ కిరణ్మయి, ఆర్ ఈశ్వర్ రావులు, ఎంపిపి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

సంతకవిటి: విద్యార్థుల బంగారు భవిష్యత్తు, నాణ్యమైన చదువుల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం గర్వించదగ్గ విషయమని సంతకవిటి సర్పంచ్ గట్టి భాను తెలిపారు. శనివారం స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పి.శంకర్రావు, కె. ఆనంద, పి. శ్రీనివాస్, ఎమ్. శంకర్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వి. సాయిశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతకవిటి: సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ భాను

డెంకాడ: విద్యార్థుల మెరుగైన ప్రగతికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమిష్టిగా పని చేస్తే విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలుస్తారని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, ఎంపిడిఒ భవాని, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్, నియోజకవర్గ జనసేన నాయకుడు దిండి రామారావు, విద్యాశాఖ అధికారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్, జెడ్‌పిటిసి గార తౌడు, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, ఎంఇఒలు ఎస్ విమలమ్మ, సాయి చక్రధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివి గోపాలరాజు, వైకుంఠం, ప్రదీప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు ముగ్గులు పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.రమేష్ కుమార్, మీసాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు అయితే తమ బంగారు భవిష్యత్తుని తమ చేతులారా నాశనం చేసుకునే వారు అవుతారని అందువల్ల మత్తుపదార్థాలకి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సిఐ వివిన్ మూర్తి పిలుపునిచ్చారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ లోతేటి ఈశ్వరరావు, వైస్ చైర్మన్ డోకుల రవణమ్మ, హెచ్ఎం బి ఉమామహేశ్వరరావు, సిబ్బంది, కార్యదర్శి విఈ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, అధ్యాపకులు రహీంషేక్‌లాల్, పాల్గొన్నారు.

గుర్ల: విద్యార్థులపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైసిపి నాయకులు సన్యాసినాయుడు అన్నారు. శనివారం పాలవలస పాఠశాలలో జరిగిన సమాశంలో వారు పాల్గొని మాట్లాడారు. భూపాలపురం పాఠశాలలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, కెల్ల పాఠశాలలో రాష్ట్ర వైసిపి కార్యవర్గ సభ్యులు కెవి సూర్యనారాయణరాజు పాల్గొని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు భానుప్రకాష్, శ్రీనివాసరావు, పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, టిడిపి మండల అద్యక్షుడు రౌతు కామునాయుడు, జనసేన మండల అద్యక్షుడు విసిని గిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, మాజీ ఎంపిటిసి ఆరతిసాహు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గురుకుల పాఠశాల, కెజిబివి, రామాంజనేయ పాఠశాలతో పాటు మండలలో ఉన్న అన్ని పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు.

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గల రెల్లి వీధి బాలికల పాఠశాలలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొని కష్టమైన సబ్జెక్టుల పై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఒమ్మి ఎంపిపి పాఠశాల నిర్వహించిన కార్యక్రమంలో జనసేన నాయకులు అంబల్లి అప్పలనాయుడు, తంగుడు బిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం కె. వెంకటలక్ష్మీ, గణిత ఉపాధ్యాయులు ఎస్. బంగారయ్య పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు.

నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు అప్పలనాయుడు

పంట కోతతో ఉపయోగం

డెంకాడ: నూతన వరి వంగడాల పంట కోతతో రైతులకు ఎంతో ఉపయోగమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని అభ్యుదయ రైతు కలిదిండి వెంకట సూర్యనారాయణ రాజు పొలంలో నూతన వరి వంగడాల పంట కోత ప్రయోగాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ఈ ప్రయోగం వల్ల వరి రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్నారు. ఈ విధంగా రైతులు పంట కొత్త ప్రయోగాలు ద్వారా వరి పంటను వేసుకుంటే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఈ.నిర్మల, వ్యవసాయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

బొబ్బిలిరూరల్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులూ లేకుండా చూడాలని తహశీల్దార్ యం.శ్రీను అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో మిల్లర్లు , పిఏసిఎస్, ఎఫ్‌పిఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకాల్లో తేడాలు, తేమ శాతంలో తేడాలు లేకుండా చూడాలని రైతులకు గోని సంచులు సరఫరా సక్రమంగా అందేటట్లు చూడాలని ధాన్యం తీసుకున్న వెంటనే రైతు ఖాతాలో డబ్బులు జమ అయ్యేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. సమస్యలుంటే తక్షణం తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యాం సుందర్, సిఎస్‌డిటి ఆర్.సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు దుర్మరణం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత సమీపంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వంగర గ్రామానికి చెందిన గెంజి మహేష్(35) మృతి చెందగా కొలుసు రమణ, తిరండ నరసింగరావు గాయాల పాలయ్యారు. ప్రమాద సంఘటన తెలిసి పెదమానాపురం ఎస్ఐ జయంతి సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని వంగర గ్రామానికి చెందిన గెంజి మహేష్ గొర్రెల అమ్మకం కోసం మరో ఇద్దరితో కలిసి పెదమానాపురం సంతకు ఉదయాన్నే గొర్రెలు తీసుకువస్తుండగా పార్వతీపురం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది దీంతో గెంజి మహేష్ అక్కడకక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన వారిలో కొలుసు రమణ పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య వెంకట లక్ష్మి, కుమార్తెలు గోపిక శ్రీ(5) చైత్ర(3) ఉన్నారు. పిల్లలు ఇద్దరు చిన్నారులు కావడంతో భార్య కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

చెరువులో పడి మానసిక వికలాంగుడు మృతి

డెంకాడ: మండలంలోని గునుపూరిపేట గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడు పైల సూరిబాబు(29) చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరిబాబు శుక్రవారం రాత్రి గ్రామం దగ్గరలో ఉన్న పీతల చెరువుకు బహిర్భూమికి వెళ్లి చెరువులో దిగి ఈత రాక చనిపోయాడు. సూరిబాబుకు తల్లి లక్ష్మి, తమ్ముడు వెంకటేష్ ఉన్నారు. మృతునికి ఇంకా పెళ్లి కాలేదు. సూరిబాబు చనిపోయిన చెరువులో గతంలో కూడా ఇద్దరు విద్యార్థులు మునిగి చనిపోయారు. ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: సారాతో కొయ్యకొండవలస గ్రామానికి చెందిన పి.జయన్నను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో గ్రామంలో సోదాలు చేయగా జయన్న వద్ద ఐదు లీటర్ల నాటుసారా సీజ్ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని చెప్పారు. సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడిలో ఎస్ఐ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తవలస

గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంగం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బకాయి వేతనాలు చెలించాలని గ్రీన్ అంబాసిడర్లు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం గ్రామ పరిశుభ్రత కోసం పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు గత నాలుగు నెలలు నుంచి 12 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారన్నారు. పాలక ప్రభుత్వాలు కార్మికులకు సన్మానాలు చేస్తున్నాయని సన్మానాలు దీనివల్ల వారి కడుపు నిండదని ఎద్దేవా చేశారు. ప్రతి నెల 5వ తేదీకి జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు అనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 680 ప్రకారం కార్మికులకు 10వేల రూపాయలు జీతం చెల్లించాలని, 2023 జూలై 23న హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికలు రాము, బి. బంగారమ్మ, రమణమ్మ, డి. రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందార్లను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పెద బూరాడపేట గొర్రెల పెంపకం దార్లను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.వి. రమణ డిమాండ్ చేశారు. పెద బూరాడ పేటలో ఈ నెల 2న 120 గొర్రెలు ఆకస్మాత్తుగా మృతి చెందిన నేపథ్యంలో వాటి పెంపకం దార్లను సిపిఎం నాయకులు టివి రమణ, కిల్లంపల్లి రామారావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ డొప్ప త్రినాథ్‌కి చెందిన 80, కర్రి సూర్య నారాయణ కు చెందిన 15, ధూళి గౌరి నాయుడుకు చెందిన 15, ఆవాల సన్యాసమ్మకు చెందిన 8 గొర్రెలు అకరణంగా ఆకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమన్నారు. వాటి తరువాత ఈ రెండు రోజుల కాలంలో మరో 10 గొర్రెలు మృతి చెందాయని చెప్పారు. మృతి చెందిన గొర్రెలకు ఇన్సూరెన్స్ కూడా లేక పోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. అకరణంగా గొర్రెలు మృతి చెందడంతో రూ.20 లక్షలు వరకూ నష్టం కలిగి పెంపకం దార్లు దిక్కు తోచని స్థితిలో లబో దిబో మంటున్నారని, వీరికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జిల్లా కలెక్టర్ వెంటనే కలుగు జేసుకొని నష్ట పోయిన గొర్రెల పెంపకం దార్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నెల్లిమర్ల: బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - భోగాపురం

నాటు సారా, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని ముంజేరు గ్రామంలో గ్రామ పెద్దలతో కలిసి గ్రామస్తులకు వీటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరు అనధికారి బెల్ట్ షాపులు నిర్వహించరాదని సీఐ వి.రవికుమార్ అన్నారు. అనధికారి బెల్ట్ షాపులు సమాచారాన్ని తమకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, హెచ్ సి రామారావు, కానిస్టేబుల్ సన్యాసిరావు, సూర్యనారాయణ, ఎంపిటిసి పి. వెంకటసత్యం, పి తోటరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని నీలయ్యవలస గ్రామంలో రాజాం, ప్రోహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్, నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలు నిరోదంపై శనివారం అవగాహన కల్పించారు. సారా తాగటం వల్ల ఏర్పడే కష్ట నష్టాలను, సారా అలవాటు వల్ల కలుగు అనారోగ్యాల గురించి వివరించారు. సారా అమ్ముతూ పట్టుబడిన వారికి చట్ట ప్రకారం ఉన్న శిక్షలు గురించి వాటి తీవ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. జి.మాన్యాలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

సబల్ ప్రాజెక్ట్ ద్వారా కెజిపూడి ల్యాండ్ స్కేప్ పరిధిలో గల గ్రామాల రైతులకు ఆర్‌డిఎస్ వేయడానికి 9 రకాల విత్తనాలు పంపిణీ చేశారు. రైతులందరూ వరి తర్వాత రిలే సోయింగ్ పెసరలు, మినుములతో పాటు మరో 8 రకాల పంటలను వేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ తెలిపారు. రైతులందరూ బహుళ పంటల విధానాన్ని పాటించాలన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రావణి, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాయి గౌతమ్ స్కూల్‌కు నేషనల్ ఎక్స్‌లెంట్ అవార్డు

గజపతినగరం: సాయి గౌతమ్ స్కూల్‌కు నేషనల్ ఎక్సలెంట్ అవార్డు వచ్చినట్లు ప్రిన్సిపల్ ఎస్.ఎస్ నాయుడు తెలిపారు. హైదరాబాదులో ఉన్న హైటెక్స్‌లో ఈటి టెక్ సంస్థ 2024 - 2025 సంవత్సరానికి సంబంధించి ఈ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు ప్రధానోత్సవం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం వల్ల అతి తక్కువ మందిలో వచ్చిన ఈ అవార్డుకు తాము ఎన్నికయ్యామని అన్నారు. ఇంతటి ఘనవిజయానికి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల తీర్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, ట్రూ ఆఫ్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్రజా సంఘాల నాయకులు తీర్మానం చేశారు. స్థానిక బృందావనం ఫంక్షన్ హాలులో శనివారం స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ ఛార్జీలపై ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కాంగ్రెస్ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమిని గెలిపిస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి ట్రూ ఆఫ్ ఛార్జీలు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూ ఆఫ్ ఛార్జీలను వ్యతిరేకించిన టిడిపి, జనసేన నేడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం రూ.9,414 కోట్లు పడుతుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈనెల 10 నుంచి దశలవారీగా ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. 11/2024

Between:
Munakala Venkata Ramana .....Petitioner
And :
Bade Jaggu Naidu వగైరాలు .....Respondents

1. Bade Jaggu Naidu, S/o Appala Swamy, aged 50 years, R/o Davala Street, Bobbili, Vizianagaram Dist.
2. Vulla Mahesh S/o Suryanarayana, aged 40 years, R/o Yadava street, Bobbili, Vizianagaram Dist.
3. Jambu Prasad S/o Tirupathi, aged 45 years, R/o Gollalapeta, Rambhadrapuram Mandalam, Vizianagaram Dist.

ఇందుమూలంగా పైన తెలిపిన ప్రతివాదులకు తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం మరియు బొబ్బిలి మున్సిపాలిటీ కాపరస్తుడైన శ్రీ మునకాల వెంకటరమణ S/o అప్పారావు పైన తెలిపిన ప్రతివాదులు వద్ద నుండి అప్పు తీసుకొని తీర్చుటకు శక్తిలేని వాడినని తీర్పు చేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో I.P 11/2024 పిటిషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన ప్రతివాదులకు ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల స్వయంగా గాని, వకీలు ద్వారా గాని **తేది 16-12-2024దీన ఉదయం 10-30 గం॥**లకు పైన తెలిపిన కోర్టులో హాజరు కావాలని లేని పక్షంలో శ్రీ కోర్టువారు మీ పరోక్షంగా తీర్మానించడమగునని ఈ ప్రతివాదులకు ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము.

ఇట్లు
బిట్రా శ్రీనివాసరావు
పిటిషనర్ తరుపు న్యాయవాది,
బొబ్బిలి, సెల్: 6300299404

మహారాజశ్రీ విజయనగరం అదనపు సీనియర్ సివిలు జడ్జి కోర్టు
O.S. 5/2018 IA 273/2023

Between:
ఇందుకూరి అప్పలరాజు .....వాది/పిటిషనరు
And :
కందుకూరి (లేటు) మోహనరావు వగైరా
....ప్రతివాద్లు/రెస్పాండెంట్లు

2) శ్రీమతి బొండాడ వెంకట నాగ సరస్వతి, భర్త బొండాడ శివకుమార్, Flat No. 107, ఆనంద ఎన్‌క్లేవ్, మూడు కోవెళ్ళ ఎదురుగా, విజయనగరం.

3) శ్రీమతి కందుకూరి సత్య కామేశ్వరి, భర్త కోడూరి వెంకటరాజు, Flat No. 107, ఆనంద ఎన్‌క్లేవ్, మూడు కోవెళ్ల ఎదురుగా, విజయనగరం.

పై నెంబరు దావాలో మీ తండ్రి గారు కందుకూరి మోహనరావు కాలము చేసినందున వారి వారసులుగా మిమ్ములను చేర్చమని కోరుచూ పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషను దాఖలు చేయుటలో గల జాలమును క్షమించమని కోరుచూ పై నెంబరు పిటిషనును దాఖలు చేసియున్నారు. అందులకు మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టువారి ఎదుట **తే 12-12-2024దీని ఉదయం 10-30 గంటల**కు స్వయముగా కాని, వకీలు ద్వారా కాని హాజరు కావలసినదిగా యిందుమూలముగా తెలియజేయడమైనది. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మాణము చేయడమగునని తెలియపర్చుడమైనది.

పిలకా శేషాద్రి
వాది తరుపు అడ్వకేటు,
సెల్ : 9866478843